క్లుప్తంగా

నేడు మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశం

జగ్గయ్యపేట అర్బన్: పేట మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశం శనివారం నిర్వహించనున్నట్లు మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర శుక్రవారం తెలిపారు. కౌన్సిల్ మీటింగ్ హాల్‌లో ఉదయం 11 గంటలకు జరిగే సమావేశంలో పట్టణంలోని పలు అభివృద్ధి పనులు, పరిపాలనకు సంబంధించిన కేటాయింపులు తదితర 54 అంశాలతో కూడిన అజెండాను కౌన్సిల్ సభ్యుల ఆమోదం కోసం సిద్ధం చేసినట్లు తెలిపారు. గౌరవ కౌన్సిల్ సభ్యులు, గౌరవ ఎక్స్-అఫిషియో మెంబర్లు హాజరు కావాలని కోరారు.

జగనన్న భూ రక్ష, భూ సర్వే ప్రారంభం

మక్కపేట(వత్సవాయి): జగనన్న భూ రక్ష, భూ సర్వే కార్యక్రమాన్ని శుక్రవారం సర్పంచ్ గుడేటి శారమ్మ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బ్రిటీష్ హయాంలో సర్వే జరిగిందని, దాదాపు వందేళ్ల తర్వాత ఇప్పుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చొరవతో గ్రామాల్లో భూవివాదాలు లేకుండా ఉండేందుకు తీసుకున్న చర్యల్లో భాగంగానే ఈ సర్వే జరుగుతోందన్నారు. రెవెన్యూ భూమి, గ్రామకంఠం భూమి మొత్తం ఈ సర్వేలో తేలుతుందని చెప్పారు. కార్యక్రమంలో గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు కనగాల రమేష్, ఆర్ఐ కె.ప్రభుకుమార్, పంచాయతీ కార్యదర్శి కొమరగిరి సంక్రాంత్, వీఆర్వో జి స్వామి, సర్వేయర్ రూప, సచివాలయ సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

కౌలు వేలం ద్వారా రూ.1.36 లక్షల ఆదాయం

పెద్దాపురం(వీరులపాడు): మండలంలోని పెద్దాపురం గ్రామంలో ఉన్న దాసాంజనేయ స్వామి వారి ఆలయానికి చెందిన 7.72 ఎకరాల వ్యవసాయ భూమికి ఆలయ ఆవరణలో శుక్రవారం దేవదాయ శాఖాధికారులు కౌలు వేలం నిర్వహించారు. ఈ వేలం పాటల్లో 17 మంది రైతులు పాల్గొనగా బవిరిశెట్టి శ్రీనివాసరావు రూ.1.36 లక్షల హెచ్చు పాటకు దక్కించుకున్నట్లు దాములూరు గ్రూప్ టెంపుల్స్ ఈవో వాసిరెడ్డి భూపాల్ తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కోటేరు ముత్తారెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ ఆవుల రమేష్ బాబు, ఆలయ చైర్‌పర్సన్ బొజ్జా అనురాధ, గ్రామస్తులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఆయుర్వేద మజ్జిగ పంపిణీ



జగ్గయ్యపేటఅర్బన్: జగ్గయ్యపేట పట్టణ పద్మశాలీ సంక్షేమ సంఘం వారి ఆధ్వర్యంలో బాటసారుల దాహార్తిని తీర్చేందుకు స్థానిక పాత మున్సిపల్ కార్యాలయం కూడలిలో ఏర్పాటుచేసిన ఆయుర్వేద మజ్జిగ పంపిణీ కార్యక్రమం శుక్రవారం 5 వ రోజు కొనసాగింది. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు పెను మల్లి చంద్రమౌళి మాట్లాడుతూ 5 వ రోజున సుమారు 2 వేల మందికి పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సంఘ కార్యదర్శి భారత జగన్, సంఘ ప్రముఖులు గుడ్ల రామారావు, జల్లా తిరుపతిరావు, అల్లి రవి, మెటికల శ్రీనివాసరావు, మహిళా సభ్యులు కర్నాటి రాజేశ్వరి, బొడ్డు వెంకటలక్ష్మి, వనం రాజ్యలక్ష్మి, వానపల్లి నాగమణి తదితరులు పాల్గొన్నారు.

మధురంగా త్యాగరాజ కీర్తనలు

విజయవాడ కల్చరల్: త్యాగరాజస్వామి జయంతి సందర్భంగా దుర్గాపురంలోని శివ రామకృష్ణ క్షేత్రంలో జరుగుతున్న కర్ణాటక సంగీత కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం వంజరి కృష్ణ, పద్మావతి, శ్రీనిధి, సింధు తదితరులు గానం చేశారు. వీణపై చిట్టా కార్తీక్ త్యాగరాజ కృతులు పలికించారు.

రాష్ట్రంలో జమిలిగా అభివృద్ధి, సంక్షేమ పాలన

గడపగడపలో ఎమ్మెల్యే జగన్‌మోహనరావు



చౌటపల్లిలో ప్రభుత్వ సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

చౌటపల్లి(వీరులపాడు): రాష్ట్రంలో జమిలిగా అభివృద్ధి, సంక్షేమ పాలన సాగుతోందని శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు అన్నారు. మండలంలోని చౌటపల్లి గ్రామంలో శుక్రవారం ఆయన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. దీనిలో భాగంగా గ్రామంలోని ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించి పథకాల క్యాలెండర్‌ను ప్రజలకు అందజేశారు. ఈ సందర్భంగా జగన్‌మోహనరావు మాట్లాడుతూ గత ప్రభుత్వాలకు భిన్నంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని వర్గాల ప్రజల అభివృద్ధి, శ్రేయస్సే లక్ష్యంగా పాలన సాగిస్తున్నారన్నారు. సంక్షేమ పథకాలు అందించటమే కాకుండా నిరుపేదల జీవితానికి, జీవనోపాధికి పూర్తి భరోసా కల్పిస్తున్నారని గుర్తు చేశారు. ముఖ్యంగా మహిళల సంక్షేమానికి పెద్ద పీట వేయటమే కాకుండా ప్రతి ఒక్క సంక్షేమ పథకంలో మహిళలనే భాగస్వాములు చేస్తూ పథకాలను నేరుగా వారికే అందిస్తున్నారని కొనియాడారు. మహిళలకు నామినేటెడ్ పదవులలో సైతం 50 శాతం రిజర్వేషన్‌లు కల్పించిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందని కొనియాడారు. డ్వాక్రా మహిళలకు రుణమాఫీ చేస్తామని చెప్పిన చంద్రబాబు అధికారంలోకి వచ్చాక చేయకపోవటంతో సంఘాలు పూర్తిగా నిర్వీర్యమయ్యే పరిస్థితికి చేరుకున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత ఎన్నికల నాటికి మహిళా సంఘాల పేరున ఉన్న రుణాలను దశల వారీగా అందజేస్తూ డ్వాక్రా సంఘాలకు పూర్వ వైభవం తీసుకువచ్చారని తెలిపారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి రానున్న ఎన్నికల్లో ప్రజలు అండగా ఉండి ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ కోటేరు లక్ష్మి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ ఆవుల రమేష్ బాబు, జెడ్పీటీసీ సభ్యురాలు అమర్లపూడి కీర్తి సౌజన్య, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కోటేరు ముత్తారెడ్డి, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ షహనాజ్ బేగం, సర్పంచ్ పల్లెపోగు పుల్లయ్య, ఉప సర్పంచ్ కోట సంగయ్య, ఎంపీటీసీ సభ్యురాలు పల్లెపోగు మార్తమ్మ, సొసైటీ అధ్యక్షుడు కోట రామారావు, పార్టీ మండల రైతు కన్వీనర్ మట్టూరి సాయి బాబు, పలువురు నాయకులు, వలంటీర్‌లు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

బ్యాంకు లావాదేవీలపై డ్వాక్రా మహిళలకు అవగాహన



డ్వాక్రా మహిళలకు బ్యాంకు లావాదేవీలపై అవగాహన కల్పిస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

పెండ్యాల(కంచికచర్ల): పొదుపు సంఘాలకు సంబంధించిన బ్యాంకు ఖాతా రుణాలు, చెల్లింపుల విషయాలపై డ్వాక్రా సంఘాల సభ్యులకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాల్సిన బాధ్యత వెలుగు కార్యాలయంలో పనిచేసే బుక్ కీపర్లదేనని ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు అన్నారు. మండలంలోని పెండ్యాల న్యూ కాలనీ గ్రామానికి చెందిన కొంతమంది మహిళలు తమ పొదుపు సంఘాల నుంచి కొంత నగదు బ్యాంకు ఖాతా నుంచి కట్ అవుతున్నాయని బ్యాంకు అధికారులు సరైన సమాచారం ఇవ్వటం లేదని శుక్రవారం ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. రైతు భరోసా కేంద్రంలో సమావేశం నిర్వహించిన అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ, స్వయం సహాయక సంఘాల సభ్యుల బ్యాంకు ఖాతాలో ఉన్న నగదు, చెల్లింపుల విషయాలను వీఓఏలు ఎప్పటికప్పుడు సభ్యులకు తెలియజేయాలన్నారు. వెలుగు అధికారులు సంఘ సభ్యులతో చులకనగా మాట్లాడినా, వారి పట్ల దురుసుగా ప్రవర్తించినా ఉపేక్షించేది లేదన్నారు. వారి బ్యాంకు ఖాతాలో నగదు డ్రాల గురించి పొదుపు గురించి లింకేజీ రుణాల గురించి వెలుగు అధికారులు సభ్యులకు తెలియజేయాలన్నారు. డ్వాక్రా సంఘ సభ్యులు కొంత నగదును పొదుపుగా చేసుకుని ఆ నగదుతో మహిళా చేయూత మార్ట్‌లను ఏర్పాటు చేసి వ్యాపారం చేయాలని, ఆ వ్యాపారంలో వచ్చిన లాభాలను ఏటా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలో జమ అయ్యేలా చూడాలన్నారు. బ్యాంకు ఖాతాలో ఎంత నగదు ఉంది, ఎంత నగదు డ్రా చేశామనే విషయాలను తెలుసుకోవాలన్నారు. పొదుపు సంఘాలకు సంబంధించిన బుక్ కీపర్లు, వీఓఏలు, సీసీలు, ఏపీఎంలు లంచాలను డిమాండ్ చేస్తే తమ దృష్టికి తీసుకువస్తే వారి స్థానంలో మరొకరిని నియమిస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ షేక్ మలక్‌బషీర్, వెలుగు ఏపీఓం కోట భాస్కర రావు, నాయకులు వేల్పుల రమేష్, సీసీలు, వీఓఏలు, డ్వాక్రా సంఘ సభ్యులు పాల్గొన్నారు.

ఉపకార వేతనాలకు ఎంపికయిన దివ్యాంగ విద్యార్థులు



జాతీయ ఉపకార వేతనాలకు ఎంపికైన దివ్యాంగ విద్యార్థులతో హెచ్‌ఎం ప్రసాద్

కంచికచర్ల: కంచికచర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9, 10 తరగతులు చదువుతున్న దివ్యాంగ విద్యార్థులు జాతీయ ఉపకార వేతనాలకు ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయుడు ఎస్ఎస్ ప్రసాద్ శుక్రవారం తెలిపారు. ప్రత్యేక విద్యా ఉపాధ్యాయుడు వెంకటేశ్వరరావు మాట్లాడుతూ తమ పాఠశాలలో చదువుతున్న ఆరుగురు దివ్యాంగ విద్యార్థులు అకడమిక్ మెరిట్ ప్రకారం జాతీయ ఉపకార వేతనాలకు ఎంపికయ్యారని వారికి ఏడాదికి రూ.11వేలు నగదు ఇంటర్ చదువు పూర్తయ్యే వరకు పొందుతారన్నారు. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు, పారితోషకాలను దివ్యాంగ విద్యార్థులు అందిపుచ్చుకుని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో తెలుగు ఉపాధ్యాయుడు షేక్ ఇస్మాయేలు, విద్యార్థులు పాల్గొన్నారు.

వేసవి సెలవులను సద్వినియోగం చేసుకోవాలి

పెనుగంచిప్రోలు: వేసవి సెలవులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని మాజీ ఎంపీపీ, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ నాయకుడు గూడపాటి శ్రీనివాసరావు అన్నారు. స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో శుక్రవారం తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం సూరిబాబు మాట్లాడుతూ విద్యార్థులు వేసవి సెలవులను సద్వినియోగం చేసుకునేందుకు ప్రభుత్వం మే 1 నుంచి జూన్ 10 వరకు ప్రత్యేక కార్యక్రమాలను ఏర్పాటు చేసిందన్నారు. విద్యార్థులను పాఠశాలకు రప్పించి ఉపాధ్యాయుల పర్యవేక్షణలో గ్రంథాలయంలోని పుస్తకాలు చదివేలా ప్రోత్సహించటం, వచ్చే ఏడాదికి సంసిద్ధత చేయటం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తుందన్నారు. రక్తహీనత ఉన్న పిల్లలను గుర్తించి మందులు ఇస్తారన్నారు. కార్యక్రమంలో మండల పరిషత్ ఉపాధ్యక్షుడు గుంటుపల్లి వాసు, పేరెంట్స్ కమిటీ చైర్మన్ నరాల మధుసూదనరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సచివాలయ డిజిటల్ అసిస్టెంట్‌పై ఫిర్యాదు

నందిగామ: మండలంలోని చందాపురం సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న వెంకటరాజు తనపై దాడి చేశాడని అదే గ్రామంలో వీఆర్వోగా పనిచేస్తున్న బాబూరావు శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్ఐ సురేష్ తెలిపిన సమాచారం ప్రకారం చందాపురం సచివాలయంలో ఓ రైతుకు చెందిన పాస్ బుక్ విషయంలో తమ మధ్య వాగ్వాదం జరిగిందని, ఈ నేపథ్యంలో డిజిటల్ అసిస్టెంట్ తనపై దాడి చేశాడని వీఆర్వో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

ఎమ్మెల్యేను కలసిన తహసీల్దార్



కంచికచర్ల: కంచికచర్ల తహసీల్దార్‌గా గురువారం బాధ్యతలు చేపట్టిన పి.శంకరరావు శుక్రవారం మర్యాదపూర్వకంగా స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహన్‌రావును కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మండలంలోని గ్రామాల ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు పూర్తిస్థాయిలో పనిచేయాలని అన్నారు. వివిధ సమస్యలపై కార్యాలయానికి వచ్చిన ప్రజల సమస్యలు పరిష్కారం అయ్యేలా చూడాలన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెనుగంచిప్రోలు: మండలంలోని నవాబుపేట విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ నిలుపుదల చేస్తున్నట్లు ఏఈ పూర్ణచంద్రరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మరమ్మతుల కారణంగా విద్యుత్ నిలిపివేస్తున్నామని, వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

- వత్సవాయి: మండల పరిధిలోని లింగాల సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల నిమిత్తం శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏఈ వెంకటేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు సరఫరా నిలిపివేస్తామని తెలిపారు. వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.
- జగ్గయ్యపేటఅర్బన్: పట్టణంలో శనివారం కొన్ని ప్రాంతాల్లో లైన్ మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపు కార్యక్రమం చేపట్టినందున ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ శాఖ పట్టణ ఏఈ టి.బాలాజీ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కాకాని నగర్, తొర్రగుంటపాలెం, పట్టణం నుంచి చిల్లకల్లు రోడ్, ధనంబోడు కాలనీ, విద్యానగర్ ఏరియాలలో సబ్ స్టేషన్ మెయింటెనెన్స్ కారణంగా విద్యుత్ సరఫరా నిలివేస్తున్నట్లు తెలిపారు. వినియోగదారులు గమనించి సహకరించాలని, అవసరమైన వారు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాల్సిందిగా కోరారు.

జగనన్నపై నమ్మకంతోనే భారీగా చేరికలు

ప్రభుత్వ విప్ ఉదయభాను



పార్టీలోకి చేరిన వారికి కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న ఉదయభాను, కృష్ణ ప్రసాద్

జగ్గయ్యపేట అర్బన్: పార్టీలు, వర్గాలు, కులాలకు అతీతంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పాలనతో రాష్ట్ర భవితవ్యంపై ఏర్పడిన నమ్మకం, భరోసా తోనే పలువురు నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్ సీపీలోకి వస్తున్నారని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను అన్నారు. ఉదయభాను నివాసంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో పట్టణంలోని కాకానినగర్‌కు చెందిన గజ్జి హేమంత్, గజ్జి వేణు కుటుంబాలు, ధనంబోడు కాలనీకి చెందిన విఘ్నేష్, అశోక్ కుటుంబాలు టీడీపీని వీడి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలోకి ఎమ్మెల్యే ఉదయభాను సమక్షంలో చేరారు. ఈ సందర్భంగా వారికి ఎమ్మెల్యే ఉదయభాను, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ యువనేత సామినేని వెంకట కృష్ణ ప్రసాద్ పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో కేడీసీసీ బ్యాంక్ తన్నీరు నాగేశ్వరరావు, పార్టీ పట్టణ అధ్యక్షుడు ఆకుల శ్రీకాంత్, మండల అధ్యక్షుడు మండవ శ్రీనివాసగౌడ్, పాటి సాంబ తదితరులు పాల్గొన్నారు.

జగనన్నే మా భవిష్యత్తుకు విశేష స్పందన

శనగపాడు(పెనుగంచిప్రోలు): జగనన్నే మా భవిష్యత్తు–మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించిందని జెడ్పీటీసీ సభ్యురాలు వూట్ల నాగమణి అన్నారు. శుక్రవారం శనగపాడు, వెంగనాయకునిపాలెం గ్రామాల్లో నిర్వహించిన కార్యక్రమంతో మండలంలో ఈ కార్యక్రమం పూర్తయింది. ఈ సందర్భంగా నియోజకవర్గ యువజన నాయకుడు సామినేని వెంకటకృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ కార్యక్రమంలో భాగంగా ప్రజాప్రతినిధులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, నాయకులు, వలంటీర్లు ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజల సమస్యలను తెలుసుకోవటంతో పాటు వారి మద్దతుతో స్టిక్కర్లు అంటించటం చేశారన్నారు. ఫోన్ నుంచి మిస్డ్ కాల్ ఇచ్చారన్నారు. ప్రజలు జగనన్నను సీఎంగా చేయటానికి సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు వూట్ల నాగేశ్వరరావు, సచివాలయాల మండల కన్వీనర్ కన్నమాల శామ్యూల్, ఎంపీటీసీ సభ్యులు కీసర లోకేశ్వరరావు, సొసైటీ అధ్యక్షుడు పారుపల్లి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయ నిధిని సద్వినియోగం చేసుకోండి



సీఎంఆర్ఎఫ్ ఎల్‌ఓసీ పత్రాన్ని బాధిత కుటుంబ సభ్యులకు అందజేస్తున్న ఉదయభాను

జగ్గయ్యపేట అర్బన్: అనారోగ్యంతో బాధపడుతున్న నిరుపేదల కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న ముఖ్యమంత్రి సహాయ నిధి పథకాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను అన్నారు. ఎమ్మెల్యే ఉదయభాను నివాసంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో వత్సవాయి మండలం మంగొల్లు గ్రామానికి చెందిన నంబూరి చంద్రశేఖర్, వాణి దంపతుల కుమార్తెకు అనారోగ్యం కారణంగా వైద్య ఖర్చుల నిమిత్తం ముందస్తు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన రూ 5.50 లక్షల ఎల్‌ఓసీ పత్రాన్ని లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో మంగొల్లు వైఎస్సార్ సీపీ నాయకులు సామినేని లక్ష్మీనారాయణ, అన్నెపాగ నరసింహారావు, కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, పార్టీ మండల అధ్యక్షుడు మండవ శ్రీనివాసగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సేవా సంపన్నుడు



దివ్యాంగులకు బియ్యం పంపిణీ చేస్తున్న కోటి సూర్యం

నందిగామ: సొంత లాభం కొంత మానుకుని పొరుగు వాడికి సాయపడవోయ్ అన్న గురజాడ సూక్తిని అతను విద్యార్థిగా ఉన్నప్పుడే బాగా వంటబట్టించుకున్నాడు. అందుకే తానేమీ లక్షాధికారి కాకపోయినా ఉన్నంతలోనే తాను కొంత వేసుకుని, దాతల సాయంతో గత రెండు దశాబ్దాలుగా పట్టణంలో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. నందిగామ పట్టణానికి చెందిన రామిరెడ్డి కోటి సూర్యం ఓ ప్రైవేట్ కంపెనీలో చిరుద్యోగి. అతని భార్య పద్మ ఓ ప్రైవేటు పాఠశాలలో ఉపాధ్యాయిని. వారికి ఇద్దరు పిల్లలు. సొంతంగా సెంటు భూమి కూడా లేదు. అయినా ఉన్నంతలో పరులకు సాయం చేయాలనే మనస్తత్వం ఆయనది. విద్యార్థిగా ఉన్నప్పటి నుంచే చిన్న చిన్న సేవా కార్యక్రమాలు చేస్తుండేవాడు. ప్రస్తుతం తన నెల వారీ జీతంలో కొంత భాగం సేవా కార్యక్రమాలకు వినియోగించడంతో పాటు దాతల సాయంతో అనేక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నాడు.

కోటి సూర్యం సేవాయజ్ఞంలో ప్రధానాంశాలు

- 2010లో లక్ష జాతీయ జెండాలు తయారు చేయించి నందిగామ ప్రాంతంలో ప్రతి పాఠశాలకు వెళ్లి విద్యార్థులకు పంపిణీ చేశారు.
- 2012లో సత్య దివ్యాంగుల సేవా సమితి అనే స్వచ్ఛంద సేవా సంస్థ ఏర్పాటు చేసి ప్రతి నెల 20 మంది దివ్యాంగులకు ఒక్కొక్కరికి ఐదు కేజీల చొప్పున బియ్యాన్ని పంపిణీ చేస్తున్నారు.
- ప్రతి ఆదివారం యాచకులకు అన్నం ప్యాకెట్లు పంపిణీ చేస్తున్నారు.
- కరోనా సమయంలో కొన్ని నెలల పాటు కూరగాయలు, అన్నం ప్యాకెట్లు పంపిణీ చేశారు.
- వర్షాకాలంలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహిస్తారు.
- వేసవి కాలంలో మెయిన్‌బజార్‌లో గత ఏడేళ్లుగా మజ్జిగ చలివేంద్రాలు నిర్వహిస్తున్నారు.

అంగన్‌వాడీల ద్వారా నాణ్యమైన భోజనం అందించాలి



పెండ్యాల అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

కంచికచర్ల: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు నాణ్యమైన, మెరుగైన పోషక విలువలతో కూడిన ఆహారాన్ని అందించాలని ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు అన్నారు. మండలంలోని పెండ్యాలలో శుక్రవారం మూడు అంగన్‌వాడీ కేంద్రాలను ఆయన తనిఖీ చేశారు. ముందుగా వంట చేస్తున్న తీరు, రికార్డులను పరిశీలించారు. అనంతరం చిన్నారులకు అందించే భోజనాన్ని రుచి చూశారు. కార్యక్రమంలో ఎంపీపీ మలక్‌బషీర్, తహసీల్దార్ శంకరబాబు, ఎంపీటీసీ సభ్యుడు షేక్ బడే హజరత్ తదితరులు పాల్గొన్నారు.

అప్పుల బాధ తాళలేక మహిళ ఆత్మహత్య

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): అప్పుల బాధ తాళలేక ఓ మహిళ ఆత్మహత్య చేసుకున్న ఘటన విజయవాడ అయోధ్యనగర్‌లో శుక్రవారం జరిగింది. అజిత్‌సింగ్‌నగర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం అయోధ్యనగర్‌కు చెందిన రాజనాల జ్యోతి(41)కి కుమార్తె, కుమారుడు ఉన్నారు. భర్త రవికుమార్ 13 ఏళ్ల క్రితం అనారోగ్యంతో మరణించగా జ్యోతి అప్పటి నుంచి ఇంటి ముందు చిల్లరకొట్టు నడుపుతూ ఇద్దరు బిడ్డలను పోషించుకుంటోంది. అప్పులు ఎక్కువ కావడంతో ఆమె తరచూ బాధపడుతూ ఉండేది. శుక్రవారం ఉదయం షాపులో పెట్టిన డబ్బులు తగ్గడంతో తన కూతురు చరితశ్రీని పిలిచి డబ్బులు ఏమైనా తీశావా అని అడగ్గా ఆమె తానేమీ తీయలేదంటూ కోపంగా చెప్పింది. దీంతో ఒక్కసారిగా అసహనానికి గురైన ఆమె ఇంట్లోకి వెళ్లి తలుపులు వేసుకొని ఫ్యానుకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ద్విచక్ర వాహనం ఢీకొని వృద్ధుడికి గాయాలు

కృష్ణలంక(విజయవాడతూర్పు): ద్విచక్ర వాహనం ఢీకొనడంతో వృద్ధుడు తీవ్రంగా గాయపడ్డాడు. ఘటన కృష్ణలంక పీఎస్ పరిధిలోని బెంజిసర్కిల్ సమీపంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు రామచంద్రనగర్‌లోని ఆచార్య రంగా వీధిలో నివసిస్తున్న రాజపుత్ర రూప్‌సింగ్(80) శుక్రవారం ఉదయం బెంజిసర్కిల్‌లోని పెట్రోల్ బంకు వైపు నుంచి ట్రెండ్‌సెట్ మాల్ వైపు రోడ్డు దాడుతున్నాడు. ఆ సమయంలో బెంజిసర్కిల్ వైపు నుంచి పశువుల ఆసుపత్రి వైపు వెళ్తున్న ద్విచక్ర వాహనం వృద్ధుడిని ఢీకొట్టింది. అతను కిందపడిపోవడంతో తలకు, ఎడమ కాలికి బలమైన గాయాలై తీవ్ర రక్తస్రావమైంది. ప్రయాణికులు 108 ద్వారా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న కృష్ణలంక ఎస్ఐ ప్రకాశరావు ఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. బాధితుడి ఫిర్యాదుపై కేసు నమోదు చేశారు.

ఎన్టీఆర్‌కు స్వరాంజలి

విజయవాడ కల్చరల్: సినీనటుడు ఎన్టీఆర్ శత జయంతి వేడుకల సందర్భంగా చంద్రశేఖర్ కల్చరల్ అకాడమీ ఆధ్వర్యాన శుక్రవారం గాంధీనగర్‌లోని కొత్తా పూర్ణానందం కళావేదికపై నిర్వహించిన సినీ సంగీత విభావరి మధురంగా సాగింది. రైల్వే విశ్రాంతఉద్యోగి దండు చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ నటించిన చిత్రాలతోపాటు ఇతర చిత్రగీతాల పాటలు ఆలపించారు.

దివ్యాంగులపై వివక్ష చూపితే చర్యలు

కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): దివ్యాంగులపై వివక్ష చూపితే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ ఢిల్లీరావు హెచ్చరించారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో శుక్రవారం విభిన్న ప్రతిభావంతుల సంక్షేమానికి ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి సమన్వయ కమిటీ తొలి సమావేశం జరిగింది. కలెక్టర్ మాట్లాడుతూ చట్టం ద్వారా దివ్యాంగులకు కల్పించిన హక్కులను అమలు చేయడంతోపాటు, వారి సంక్షేమానికి సమన్వయ కమిటీ కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రధానంగా విభిన్న ప్రతిభావంతుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. చట్టంలోని సెక్షన్ 25ను పారదర్శకంగా అమలు చేయడానికి ప్రత్యేక అధికారిని నియమిస్తామన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో రెండు ప్రత్యేక పడకలను వారికి కేటాయించాలన్న నిబంధనలను అమలుచేయడానికి వైద్య అధికారులను ఆదేశిస్తామన్నారు. దివ్యాంగులు విద్యను అభ్యసించేలా ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో నోడల్ అధికారిని నియమించి వారు కోరుకున్న పాఠశాలలో ప్రవేశం కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. దివ్యాంగులతో కళాత్మక ప్రతిభ సాంస్కృతిక వికాసాన్ని పెంచేందుకు అకాడమీ ద్వారా శిక్షణ అందించాల్సిన అవసరం ఉందన్నారు. స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో విభిన్న ప్రతిభావంతులకు ప్రత్యేక కోచ్‌లను నియమించి వారిని ఉత్తమ క్రీడాకారులుగా తీర్చి దిద్దేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. సదరం రిజిస్ట్రేషన్ ప్రక్రియలో మార్పులు చేసేలా కమిటీ కృషి చేస్తుందన్నారు. సమావేశంలో విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ ఏడీ రామ్ కుమార్, ఎల్‌డీఎం కోటేశ్వరరావు, చేయూత స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి కృష్ణ కుమారి, ఏసీపీ కె. వెంకటేశ్వరరావు, మెప్మా పీడీ ఎస్ఎస్ విశాలాక్షి, డీఆర్డీఏ డీపీఎం జె. శోభన్ బాబు, విభిన్న ప్రతిభావంతుల ప్రభుత్వ ఉద్యోగ సంఘం నాయకులు రవీంద్ర బాబు, వికలాంగుల సంక్షేమ సంఘం అధ్యక్షులు స్వామి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నేడు మా నమ్మకం నువ్వే జగన్ విజయోత్సవ ర్యాలీ

జగ్గయ్యపేటఅర్బన్: మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం రాష్ట్ర వ్యాప్తంగా విజయవంతంగా పూర్తయిన సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మద్దతు తెలుపుతూ పట్టణంలో శనివారం విజయోత్సవ ర్యాలీ జరుగుతుందని ఎమ్మెల్యే సామినేని ఉదయభాను కార్యాలయం ప్రతినిధులు శుక్రవారం ఒక ప్రకటన ద్వారా తెలిపారు. ఈ సందర్భంగా పార్టీ నియోజకవర్గ యువనేత సామినేని వెంకటకృష్ణ ప్రసాద్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే ఉదయభాను స్వగృహం నుంచి ఉదయం 9 గంటలకు బైక్ ర్యాలీ జరుగుతుందని, పార్టీ నాయకులు, కార్యకర్తలు, యూత్ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

అంబేడ్కర్ జీవిత చరిత్రపై వ్యాసరచన పోటీలు

నందిగామ: బహుజన సేవా సమితి ఆధ్వర్యంలో పట్టణంలోని ఎంజీహెచ్ పాఠశాలలో శుక్రవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జీవిత చరిత్రపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బచ్చలకూర పుష్పరాజు చేతుల మీదుగా ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో బహుజన సేవా సమితి జిల్లా అధ్యక్షుడు పత్తిపాటి సూర్యం, పలువురు సేవా సమితి ప్రతినిధులు పాల్గొన్నారు.

విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే ఉపేక్షించం

నందిగామ: విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే ఉపేక్షించేది లేదని డీపీఓ చంద్రశేఖర్ సిబ్బందిని హెచ్చరించారు. పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం గ్రామ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో పారిశుద్ధ్యం, సచివాలయాలకు వచ్చే వారితో నడుచుకోవాల్సిన తీరు, ప్రభుత్వ పథకాల గురించి ప్రజలకు తెలియ చెప్పాల్సిన అంశాలపై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో పలువురు ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.